RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం


అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 8 | పేజీలు : 4 | శుక్రవారం 10 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

### చైనా మెగా డ్యామ్‌కు సొంత శాస్త్రవేత్తల హెచ్చరిక.. పొంచివున్న పెను ప్రమాదం!

- బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తున్న మెగా డ్యామ్‌కు ముప్పు
- క్రియాశీలక ఫాల్ట్ లైన్‌పై డ్యామ్ నిర్మాణం జరుగుతోందని వెల్లడి
- భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరిక
- భారత్, బంగ్లాదేశ్‌పై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళనలు

## సోషల్ మీడియా దుర్వినియోగంపై

# ఉక్కుపాదం






- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవిగో!
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు. సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు. విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను - మిగతా3లో

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్
- కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి



2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

# జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

- జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స
- విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం
- విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య



విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం. ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

# రావణ్‌పై పెట్టిన ఉపా కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలి

- పవన్ ను, హిందూ సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన రావణ్
- విజయవాడలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వైసీపీ, లెఫ్ట్ పార్టీలు
- రావణ్‌పై పెట్టిన కేసు చట్టవిరుద్ధమన్న అంబటి, నారాయణ





ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ పై పోలీసులు ఉపా (ఊపా) కేసు నమోదు చేయడం తెలిసిందే. అయితే, దేశద్రోహులపై ఉపయోగించే ఈ చట్టం కింద కేసు నమోదు చేయడం ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్యను ఇప్పటికే వైసీపీ ఖండిస్తుండగా... తాజాగా కమ్యూనిస్టులు కూడా ఈ జాబితాలో చేరారు. విజయవాడ వేదికగా జరిగిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో వైసీపీతో పాటు లెఫ్ట్ పార్టీలైన సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు ప్రస్తుతం అనేక ప్రజా సమస్యల్లో చిక్కుకుపోయాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అసలు విషయాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే రావణ్‌ను టార్గెట్ చేస్తూ ఈ రాజకీయ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. అతడిపై మోపిన అక్రమ 'ఉపా' కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ... ప్రశ్నించే గొంతుకలను భయభ్రాంతులకు గురిచేసి, అణచివేయడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని ప్రయోగించిందని మండిపడ్డారు. రావణ్‌పై పెట్టిన కేసు చట్టవిరుద్ధమని, ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ కేసును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శుక్రవారం 10 జూలై 2026

# సీమ వార్త సాయంకాలం

**అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా**

### వీర జవాన్ పార్తివ దేహానికికు

# ఉషశ్రీ సెల్యూట్..!!

జవాన్ రవి చంద్రా రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న... వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్.



**గోరంట్ల జులై 10 సీమ వార్త సాయంత్రం.**

దేశభద్రతలో విధులు నిర్వహిస్తూ మృత్యువాత పడిన గోరంట్ల మండల వాసి దిగువ గంగంపల్లి రవి చంద్రారెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించి అంతిమయాత్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు.భారతదేశానికి 30 సంవత్సరాలు తన వంతు కృషి చేసిన ఆర్మీ జవాన్ రవిచంద్ర రెడ్డి శుక్రవారం శ్రీనగర్ లో ప్రమాదవశాత్తు మరణించడంతో విషయం తెలుసుకుని వారి స్వగృహానికి వెళ్లి ఆర్మీ జవాన్ రవిచంద్ర రెడ్డి పార్దివదేహానికి పూలమాల వేసి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### యువతకు “ నిషా” వద్దు

# “ఇషా” ముద్దు..!!








....మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.

యువతకు ‘నిషా’ (వ్యసనం) వద్దు.. ‘ఇషా’ (జ్ఞానోదయం) కావాలి.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి.

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

సమాచారం కోసం 1972 టోల్ ఫ్రీ నెంబర్ ని తెలిపిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్.

### రవిచంద్రా నువ్వు హస్తమించిన...

# నీ సేవలు ఉదయిస్తాయి..!!



అమరుడు సీఆర్పీఎఫ్ ఎస్సై రవీంద్రారెడ్డికి ఘన నివాళి

అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్.

సైనిక లాంచనాలతో స్వగ్రామం దిగువ గంగంపల్లిలో వీర జవాన్ కు అంత్యక్రియలు.

పార్థివ దేహం పై జాతీయ జెండా కప్పి జోహార్లు అర్పించిన సిఆర్పిఎఫ్ సైనికులు.





### కోర్కెల కై గొంతెత్తిన

# అంగన్వాడీలు!

న్యాయమైన డిమాండ్ల కోసం... జిల్లా కేంద్రంలో నిరసన గళం.

కూటమి పాలన రెండు ఏళ్ళు అయినా ఫలితం శూన్యం.

అంగన్వాడిలకు వేతనాలు పెంచాలి..సిఐటియు.

జాయింట్ కలెక్టర్ భరద్వాజ్ కు వినతి పత్రం అందజేసిన అంగన్వాడీలు.





**పుట్టపర్తి జులై 10 సీమ వార్త సాయంత్రం.**

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, పని భారాన్ని తగ్గించాలని, నవ చేతన యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కోర్కెల దినం సందర్భంగా శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చింది.అందులో భాగంగా శుక్రవారం సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వేలాది మంది అంగన్వాడీలు గణేష్ సర్కిల్ నుంచి ర్యాలీ చేపట్టారు. ర్యాలీ నీ పోలీసులు అడ్డుకోవడంతో అంగన్వాడీలు బారికేడ్స్ తోసుకొని ముందుకు సాగారు. పోలీసులు మళ్ళీ ఆర్టీసీ డిపో వద్ద ర్యాలీ నీ అడ్డుకోవడంతో అంగన్వాడీలు అక్కడే రోడ్డు పై రెండు గంటల పాటు బైటాయించి నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు పనిభారాన్ని తగ్గించాలని, నవచేతన యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ రంగానికి నిధులు తగ్గించి అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. పిల్లలకు, పేద గర్భిణీలకు ఆసరాగా ఉన్న అంగన్వాడి వ్యవస్థకు సరిపడా నిధులు కేటాయించి బలోపేతం చేయాలన్నారు. సత్యసాయి జిల్లాలో అంగన్వాడీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులు చెల్లించాలని, అన్ని మినీ సెంటర్ లను అప్ గ్రేడ్ చేయాలని, అంగన్వాడీలను బిఎల్ఓ డ్యూటీ నుండి మినహాయింపు ఇవ్వాలని ఐసిడిఎస్ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. సీఐటీయూ అధ్యక్షులు జడ్పీ. శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ అంగన్వాడిలకు అండగా ఉంటామని జీతాలు పెంచుతామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన తెలుగుదేశం కూటమి పార్టీలు ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్న వేతనాలు పెంచలేదన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ భరద్వాజ్ కి అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడానికి త్వరలోనే యూనియన్ ప్రతినిధులతో జాయింట్ లెవెల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ్పీ. శ్రీనివాసులు, జి.ఎల్ నరసింహులు కోశాధికారి లక్ష్మీనారాయణ జిల్లా ఆఫీస్ బేరర్స్ సాంబశివ, పైపల్లి గంగాధర్, ముత్యాలు, బాబా, దిల్షాద్, ఉషారాణి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీదేవి కోశాధికారి రంగమ్మ నాయకురాళ్లు సుజాత, లక్ష్మీదేవి, చంద్రకళ, భాగ్యమ్మ, సుజాత, ప్రమీల, దీనా, అరుణ, భారతి, రమణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

శుక్రవారం
10 జులై 2026

# యువతకు “ నిషా” వద్దు “ఇషా” ముద్దు..!!







**ధర్మవరం జులై10 సీమ వార్త సాయంత్రం.**
యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానం నందు నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ వారు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎప్పుడూ సాధారణ ప్రజలతో మాట్లాడే తమకు, ఈరోజు ఉత్సాహవంతులైన యువతను, దేశానికి ఎంతో కీలకమైన విద్యార్థులను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.గంట సేపటి నుండి ఎంతో క్రమశిక్షణతో ఎదురుచూస్తున్న విద్యార్థుల తీరును ఆయన అభినందించారు.తాము చదువుకునే రోజుల్లో డ్రగ్స్ వంటి వాటి గురించి వినేవాళ్లం కాదని, కనీసం టీవీలు కూడా ఉండేవి కావని గుర్తుచేశారు.కానీ నేటి యువతను పక్కదారి పట్టించడానికి చుట్టూ ఎన్నో రకాల ఆకర్షణలు (ఇంట్లో టీవీ, చేతిలో మొబైల్, బయట బైక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా వంటివి) ఉన్నాయని పేర్కొన్నారు.ఇన్ని ఆకర్షణలు ఉన్నప్పటికీ, వాటిని ఎదిరించి విద్యార్థులు తమ కెరీర్‌ను మౌల్డ్ చేసుకుంటున్నారంటే.. నాటి తరం కంటే నేటి తరం ఎంతో గొప్పదని కలెక్టర్ కొనియాడారు.స్నేహితుల ఒత్తిడి వల్ల అలవాటయ్యే సిగరెట్లు, డ్రగ్స్ వంటి వ్యసనాలు మొదట నెమ్మదిగా ప్రారంభమై, ఆ తర్వాత వాటి నుండి బయటపడటం చాలా కష్టంగా మారుతుందని హెచ్చరించారు. కేవలం పక్కన వారిని చూసి హీరోలా కనిపించాలనో, స్టార్లు లాగా హెయిర్ స్టైల్, డ్రెస్సింగ్ చేయాలనో అనుకోవడం సరికాదన్నారు.బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల దేశంలో ఎంతో మంది యువత ప్రాణాలు కోల్పోతున్నరు.ఒక రాయిని పైనుంచి వదిలేస్తే అది సులభంగా కింద పడిపోతుంది, కానీ అదే రాయిని పైకి తీసుకురావాలంటే బలాన్ని ఉపయోగించాలి.చెడు అలవాట్లు కూడా రాయి కింద పడినంత సులభంగా వచ్చేస్తాయి, కానీ ఉదయాన్నే లేవడం, యోగా/వ్యాయామం చేయడం, ఉపాధ్యాయులను గౌరవించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవడానికి మనస్సును అదుపులో ఉంచుకుని ప్రత్యేకంగా శ్రమించాల్సి ఉంటుందని ఉదాహరించారు.యువతకు ‘నిషా’ (వ్యసనం) వద్దు.. ‘ఇషా’ (జ్ఞానోదయం) కావాలి అని స్పష్టం చేశారు.సరిహద్దుల్లో సైనికులు దేశం కోసం ఎలా పోరాడుతున్నారో, విద్యార్థులంతా దేశం లోపల ఉన్న డ్రగ్స్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి సామాజిక రుగ్మతలపై పోరాడే సామాజిక యోధులుగా మారాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా తమ కెరీర్‌లో ఉన్నతంగా ఎదుగుతూనే, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు (డ్రగ్స్) దూరంగా ఉండి, దేశ ప్రగతికి భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘నశా ముక్త్ భారత్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ (మార్చి 23 – అమరవీరుల దినోత్సవం) స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. చిన్న వయసులోనే దేశం కోసం పోరాడిన భగత్ సింగ్ లాంటి వారిని తలుచుకుంటూ, యువత డ్రగ్స్ వంటి అలవాట్లకు బానిసలై తమ జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు.జిల్లాలో ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. దీని కొరకు 1972 లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించవచ్చని ఎస్పీ వెల్లడించారు.ఈ కార్యక్రమం లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి. అర్చన,ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య,ధర్మవరం తహసీల్దార్,హరీష్ బాబు – బీజేపీ ఇంచార్జి,డాక్టర్ శ్రీనివాస రెడ్డి,సంధా రాఘవ, టీడీపీ ఇంచార్జి,శ్రీహరి, ఎస్ ఐ , ఈగల్ విభాగం,డాక్టర్ జెథస్వాని, ఎండీ , సైకాలజిస్ట్,విద్యార్థులు, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

-మొదటిపేజీ తరువాయి
గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు. సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.
ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.

**భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్**
రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ాఎ్ఞుీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

**అమరావతిపై కీలక నిర్ణయాలు**
అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు.
అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

**విద్యారంగానికి పెద్దపీట**
సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ



విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు “సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్” ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.

**టూరిజం ప్రోత్సాహానికి కొత్త పాలసీ**
ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅషెవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి ‘వయబిలిటీ గ్యాప్ ఫండింగ్’ కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ**
సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ‘జలధార’ కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**
దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల ‘తోపు పోరంబోకు’ భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

**మరికొన్ని ముఖ్యమైన ఆమోదాలు**
అనంతపురం, మంగళగిరి, రాయదుర్గంలో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయింపు.
విశాఖపట్నంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు.
రైతుల నుంచి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ విత్తనాల కోసం ఎన్‌సిడిసి నుంచి రూ.1800 కోట్ల రుణం సమీకరణ.
తిరుపతి సమీపంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు భూ కేటాయింపు.
హైకోర్టులో ఒక రిజిస్ట్రార్ పోస్టు మంజూరు.
కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

## మూలికతో క్యాన్సర్‌కు చెక్

## జంతువులపై ప్రయోగాలు సక్సెస్

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని నయం చేసే సామర్థ్యం గంధమార్దన్? కొండల్లో లభించే ఒక అరుదైన మూలికకు ఉందని పరిశోధకులు గుర్తించారు. జంతువులపై నిర్వహించిన ప్రయోగాలు ఆశాజనక ఫలితాలు ఇస్తున్నాయని, త్వరలోనే మనుషులపై కూడా ప్రయోగాలు చేయడానికి సిద్ధమవుతున్నాయని వారు చెబుతున్నారు. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయానికి చెందిన బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్? విభాగం దీనిపై పరిశోధనలు చేస్తోంది. గత 35 రోజులుగా జంతువులపై చేస్తున్న ప్రయోగాలు అత్యంత ఆశాజనకమైన ఫలితాలు ఇస్తున్నాయి. మరో 90 రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇవి కనుక విజయవంతమైతే, దేశంలోని సీసీఆర్ఏఎస్ గుర్తింపు పొందిన ఆసుపత్రితో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకొని, ఈ ఔషధాన్ని మనుష్యులపై ప్రయోగించడానికి చర్యలు చేపడతారు. ఆ ప్రక్రియ మరో 9 నెలలపాటు కొనసాగుతుందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న క్యాన్సర్ చికిత్సలు చాలా ఖరీదైనవి. ఇవి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. అందుకే సంబల్‌పూర్ విశ్వవిద్యాలయ పరిశోధకులు గత ఐదేళ్లుగా గంధమార్దన్? కొండల్లో లభించే కొన్ని విశిష్ట ఔషధ మొక్కలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. చివరికి ఐదు ప్రధానమైన మూలికలను గుర్తించారు.

## తాగునీటి సమస్య పరిష్కారం.

చొరవ చూపి పరిష్కరించిన....ఎంపిడిఓ రామ నాయక్.



**తనకల్లు,జులై 10 సీమ వార్త సాయంత్రం.** తనకల్లు మండల పరిధిలోని ఎగువ బత్తినవారి పల్లి లో త్రాగు నీరు కోసం అనేక ఇబ్బంది పడు తున్నారు. ఊరుమోటార్ చెడిపోవడం తో, నీరు అందక గ్రామ ప్రజలు అనేక ఇబ్బంది పాలు పడుతున్నారు. ఈ సమస్య ను గ్రామస్తులు మండల డెవలప్ మెంట్ ఆఫీసర్ ఎంపిడిఓ రామ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి గ్రామస్తుల త్రాగునీరు సమస్య ను తీర్చడానికి వెంటనే ట్యాంకర్ తో నీళ్లు తొలించి ప్రజల దాహం తీర్చినందుకు గ్రామ ప్రజలు ఎంపిడిఓ కు ధన్యవాదములు తెలియజేసి హర్షం వ్యక్తం చేసారు.

## రవిచంద్రా నువ్వు హస్తమించిన...

## నీ సేవలు ఉదయిస్తాయి..!!

**గోరంట్ల జులై 10 సీమ వార్త సాయంత్రం.**
దేశ భద్రత కోసం దేశ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ హస్తమించిన నువ్వు దేశం కోసం చేసిన సేవలు ఉదయిస్తాయని దేశ ప్రజల గుండెల్లో నువ్వు చిరస్థాయిగా నిలుస్తావని వీర జవాన్ రవి చంద్రారెడ్డి పార్టీవ దేహం ముందు జోహార్లు అర్పించారు దేశభక్తులు.జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం దిగువ గంగంపల్లికి చెందిన సీఆర్పీఎఫ్ ఎస్సై ఎనుముల రవీంద్రారెడ్డికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. పుట్టపర్తి మండలం పెడబల్లి వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన, ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తరలిస్తున్న రవీంద్రారెడ్డి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, పూలమాల వేసి నివాళులర్పించారు. రవిచంద్ర రెడ్డి జమ్మూ కాశ్మీర్లో కుల్ గావ్ జిల్లా శ్రీనగర్ ప్రాంతంలో సి ఆర్ పి ఎఫ్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. దీంతో ఆయన పార్టీ దేహాన్ని అక్కడ నుంచి విమానం ద్వారా బెంగళూరు తరలించి అక్కడ నుంచి పుట్టపర్తికి అనంతరం స్వగ్రామమైన గోరంట్ల మండలం దిగువ గంగంపల్లికి 12 మంది సియర్ పిఎఫ్ సైనికులు ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు.ఈ సందర్భంగా అక్కడ “అమర్ హై... అమర్ హై... సీఆర్పీఎఫ్ ఎస్సై రవీంద్రారెడ్డి” అంటూ నినాదాలు మారుమోగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన రవీంద్రారెడ్డి మృతి అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన త్యాగం దేశానికి చిరస్మరణీయమని కొనియాడారు. రవీంద్రారెడ్డి కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొంటూ, దేశ ప్రజలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. వీర జవాన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పుట్టపర్తి నుంచి ప్రత్యేక వాహనం పెడబల్లి చేరుకోగానే గోరంట్ల ఎస్ఐ రామచంద్ర తన సిబ్బందితో స్వాతం పలుకుతూ స్వగ్రామం వరకు వెంట ఉన్నారు.ఈ కార్యక్రమంలో స్థానికులు జనార్దన్ రెడ్డి,నాగభూషణ్ రెడ్డి, శంకర్ రెడ్డి లతో పాటు మండల టీడీపీ కన్వీనర్ సాగర్, సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, టీడీపీ నాయకులు నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పీవోకేలో తీవ్ర ఉద్రిక్తత..

## పాకిస్థాన్‌కు 48 గంటల అల్టిమేటం!

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. జమ్ము కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) తమ 38 డిమాండ్లను నెరవేర్చాలంటూ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధిస్తూ అల్టిమేటం జారీ చేసింది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తీవ్రస్థాయిలో తుది దశ పోరాటం చేపడతామని హెచ్చరించింది. ఈ నెల 27న పీఓకేలో ప్రాంతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన 12 అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలనే నిర్ణయం తాజా ఆందోళనలకు ప్రధాన కారణమైంది. ఈ నిర్ణయం ద్వారా పాక్ కేంద్ర ప్రభుత్వం స్థానిక రాజకీయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందని జేఏఏసీ ఆరోపిస్తోంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో, ముజఫరాబాద్‌కు భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని కమిటీ పిలుపునిచ్చింది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పౌర సమాజం, వాణిజ్య, విద్యార్థి సంఘాలతో 2023లో ఏర్పాటైన జేఏఏసీ, పెరిగిన ధరలు, విద్యుత్ ఛార్జీలు, గోధుమ పిండిపై సబ్సిడీ వంటి డిమాండ్లతో ఈ ఏడాది మే నెలలో చేపట్టిన భారీ నిరసనలతో వెలుగులోకి వచ్చింది. మంగ్లా డ్యామ్ వంటి ప్రాజెక్టుల ద్వారా స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌పై తమకే హక్కులు కల్పించాలని, అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయాలని కమిటీ డిమాండ్ చేస్తోంది. గత కొన్ని వారాలుగా పీఓకేలో బంద్‌లు, ధర్నాలతో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ పలువురిని అరెస్ట్ చేసిందని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఆహారం, మందుల కొరత ఏర్పడిందని, తక్షణమే మానవతా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని ‘ఆజాద్ కశ్మీర్’ అని పిలుస్తున్నప్పటికీ, ఇక్కడి సహజ వనరులను వాడుకుంటూ తమను ఆర్థికంగా అణచివేస్తోందని స్థానికులు సుదీర్ఘ కాలంగా ఆరోపిస్తున్నారు. కాగా, జమ్ముకశ్మీర్ మొత్తం తమ అంతర్భాగమేనని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసిన విషయం విదితమే.

## ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ‘మెల్‌బోర్న్ మీట్స్ మోదీ’ కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు.

సీమ వార్త సాయంకాలం

శుక్రవారం
10 జూలై 2026

## జనం గొంతు నిండా గోవింద నామం..!!

....కనుల పండగగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం





**బద్వేల్ జూలై 10 సీమ వార్త సాయంత్రం.** బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు లోని సుమిత్రానగర్ లో వెలిసిన శ్రీ మహాలక్ష్మీమ గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీ అభయ ఆంజనేయ స్వామి . దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీవారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కనుల పండగగా శ్రీవారి కల్యాణ మహోత్సవం జరిగింది.పలువురు భక్తులు తమ భక్తిని చాటుకున్నారు, స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారుజాము నుండి పట్టణ పరిసర ప్రాంత భక్తాదులందరూ విశేష సంఖ్యల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాలే పెంచల్ రెడ్డి నిమ్మకాయల శివారెడ్డి వెంకటరమణ, రాఘవేంద్ర,అనిత్, సిరిగిరి వెంకటేశ్వర్లు, లేబకు సుబ్బరాయుడు, బండారు సురేష్ బాబు, పత్తి హరీష్ మరియు పలువురు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాకపోకల కై మున్సిపాలిటీకి సహకరించండి.



**బద్వేల్ జూలై 10 సీమ వార్త. సాయంత్రం.** బద్వేల్ పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ దారిలో చేపల విక్రయం జరుగుతున్న ప్రదేశాన్ని గౌరవ మున్సిపల్ కమీషనర్ శ్రీ యం.కృష్ణ గారు పరిశీలించారు.చేపల విక్రయం కారణంగా కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో గుమికూడడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు.ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా చేపల విక్రయాన్ని అనువైన మరో ప్రదేశంలో నిర్వహించుకోవాలని సంబంధిత విక్రేతకు మున్సిపల్ కమిషనర్ గారు సూచించారు. ప్రజల సౌకర్యం, రహదారి భద్రత మరియు సజావుగా రాకపోకలు కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరుతున్నాము.

## మాధవ్ సేవలకు ఏడాది...శుభాకాంక్షలు తెలియజేసిన విజయ్



**బద్వేల్ జూలై 10 సీమ వార్త సాయంత్రం.** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పి.వి.ఎన్. మాధవ్ బాధ్యతలు చేపట్టి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో పార్టీని బలోపేతం చేయడంలో మరియు ప్రజా సమస్యలపై పోరాటంలో మాధవ్ అనుసరిస్తున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. రానున్న కాలంలో వారి నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

## త్రిబుల్ ఐటీ సాధించిన విద్యార్థులను అభినందించిన మండల విద్యాశాఖ అధికారి.



**ధర్మవరం జూలై 10 సాయంకాలం సీమ వార్త :** సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప, కొత్తచెరువు మండల విద్యా శాఖ అధికారి మండల నోడల్ ఆఫీసర్ బి. గోపాల్ నాయక్ అందరూ కలిసి బి ఎస్ ఆర్ మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ సంజయ్ నగర్ కు ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. త్రిబుల్ ఐటీ సాధించిన 19 మంది విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు బాలికల పాఠశాల కాబట్టి అందరిని సమానంగా చూస్తే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలని ఉపాధ్యాయులను కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ వి జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరూ పాల్గొనడం జరిగిందని తెలిపారు.

## ఆపిలేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం



**కళ్యాణదుర్గం, జూలై 10 సీమవార్త సాయంకాలం :** కుందుర్పి మండలం ఆపిలేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 23 మంది విద్యార్థులకు సంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి విద్యారంభం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాజా మొదటి తరగతి విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, పెన్సిళ్లను బహుమతిగా అందజేశారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, చిన్నారులను మొబైల్ ఫోన్లు, టెలివిజన్‌లకు దూరంగా ఉంచి చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరి, సురేష్, లోకేష్, రాజా, జయశ్రీ, లక్ష్మన్న, శివప్రసాద్, రేణుకమ్మ, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హైవే ప్రమాదాల ప్రాణాధార.... 1033(కాల్ నెంబర్)అంబులెన్స్

ఇనగలూరు టోల్ ప్లాజాలో అత్యవసర అంబులెన్స్ సేవలు




**ఓబులదేవరచెరువు (జూలై11)సీమవార్త సాయంత్రం** నేషనల్ హైవే నంబర్ 716జి రహదారి పై ప్రమాదాలు జరిగితే 1033,8796221012 లకు ఫోన్ చేస్తే అంబులెన్స్ సేవలు ప్రయాణికులకు ప్రాణాధారగా నిలుస్తాయి.బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల వరకు హైవేపై ఏవైనా వాహనాలు ప్రమాదాలకు గురైతే 1033 కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే అంబులెన్స్ సేవలు అందుతాయి.రెండు నెలల క్రితం ప్రారంభమైన ఇనగలూరు టోల్ ప్లాజా వద్ద అంబులెన్స్ సేవలు నిత్యం అందుబాటులో ఉంటాయని సంబంధిత టోల్ అధికారులు తెలిపారు.బి.కొత్తపల్లి నుంచి గోరంట్ల వరకు గ్రామాల్లో ఉన్న స్థానికులు లేదా హైవేపై ప్రయాణించే వారు ప్రమాదం జరిగిన విషయాన్ని సమాచారం 1033 తోపాటు 8796221012 ఫోన్ చేయాల్సి ఉంటుంది.అలాగే అంబులెన్స్ సేవల విషయాన్ని అందరూ గమనించి సద్వినియోగం చేసుకోవాలని టోల్ ప్లాజా మేనేజర్ మస్తాన్,హైవే అథారిటీ సూపర్వైజర్ విశ్వక్ రాజ్, ఈఎంటిలు శివమణి,పవిత్ర లు కోరారు.

## అమరుడు సీఆర్పీఎఫ్ ఎస్సై రవీంద్రారెడ్డికి ఘన నివాళి

అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





**పుట్టపర్తి, జూలై 10 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :-** జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన గోరంట్ల మండలం దిగువ గంగంపల్లికి చెందిన సీఆర్పీఎఫ్ ఎస్సై ఎనుముల రవీంద్రారెడ్డికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఘనంగా నివాళు లర్పించారు. పుట్టపర్తి మండలం పెడబల్లి వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన, ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తరలిస్తున్న రవీంద్రారెడ్డి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అక్కడ "అమర్ హై... అమర్ హై... సీఆర్పీఎఫ్ ఎస్సై రవీంద్రారెడ్డి" అంటూ నినాదాలు మారుమోగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన రవీంద్రారెడ్డి మృతి అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన త్యాగం దేశానికి చిరస్మరణీయమని కొనియాడారు. రవీంద్రారెడ్డి కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొంటూ, దేశ ప్రజలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. వీర జవాన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**టీడీపీ కార్యకర్త బోయ సుధాకర్ మృతికి మాజీ మంత్రి పల్లె నివాళి**

పుట్టపర్తి మండలం పెడబల్లి పంచాయతీ బత్తలపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త బోయ సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుధాకర్ మృతి బాధాకరమని పేర్కొన్న మాజీ మంత్రి, ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో పాటు తాను వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ సాగర్, సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, టీడీపీ నాయకులు నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

.....సత్యసాయి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జీవైపి రావు



**పుట్టపర్తి జూలై 11 సీమ వార్త సాయంత్రం.** ఏపీ పి టి డి ( ఏపీఎస్ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు పాల్గొనాలని సత్యసాయి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి వై పి రావు కోరారు. ఈనెల 11 శనివారం సత్యసాయి జిల్లాలోని అన్ని డిపోలలో ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఆవిర్భావ దినోత్సవాల్లో ఎంప్లాయిస్ యూనియన్ పథకావిష్కరణ గావించి, ఉద్యోగులం దరికీ మిఠాయిలు పంచిపెట్టాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయాలను ఉద్యోగులకు అందరికీ తెలియజేయాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రస్తుతం విద్యుత్ బస్సుల సమస్యలను పరిష్కరించే పోరాటానికి ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంప్లాయిస్ యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు సి. నబి రసూల్, నాగార్జున రెడ్డి, బాబయ్య, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు జివైపి రావు,శ్రీనివాసులు, ఆదినారాయణ, తదితరులు హాజరవుతారన్నారు . ఈ కార్యక్రమాల్లో ఆయా డిపోల ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## మిస్సింగ్ ఓట్ల క్లియర్ చేయడానికి స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్



**సోమందేపల్లి జూలై 10 సీమ వార్త** మండల కేంద్రంలో గల 14 బూతుల బిఎల్ఓలు బిఎల్ ఎ యానిమేటర్స్ అంగన్వాడి టీచర్స్ ఆశా వర్కర్లు వీఆర్ఓ వీఆర్ఏ ల సమావేశం జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేశారు. మండలంలో గల మిస్సింగ్ ఓట్లను క్లియర్ చేయడానికి స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మారుతి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ అధికారులు, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, పట్టణ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ హస్తకళల రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్, మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప, పట్టణ అధ్యక్షులు సూరి పాల్గొని వారి ఓట్లను బూతుల వారిగా ఓటర్స్ ను పరిశీలించుకొని నమోదు చేశారు.

## వైద్యం అందక పాడి పశువు మృతి.

.....పాడి పశువు తోనే మా జీవనం రైతన్న ఆవేదన.



**తనకల్లు, జులై 8 సీమ వార్త సాయంత్రం.** తనకల్లు మండల పరిధిలోని గోవిందువారి పల్లికి చెందిన పి జీ శ్రీనివాసులు అనే రైతు పాడి ఆవులతో జీవనం సాగిస్తూ కుటుంబం పోసిస్తూ ఉన్నాడు. ఆవు ఈనమోపినెలలు గడిచింది ఆవుఈనుతుందని పశువైద్యులు డాక్టర్ రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అసిస్టెంట్ రఘును పంపించి ఆవుకు వైద్యం చేసి దూడను తీశారు. అయితే మ్యాయి రాలేదు, డాక్టరకు ఆయన అసిస్టెంట్ కు ఎన్ని సార్లు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఈ పశువైద్యులను వదులుకోలేక, వేరే వాళ్ళ కు చెప్పలేక ఆవును కోల్పోయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఆవు చనిపోయిందని, శ్రీనివాసులు అన్నారు. నేను ఆవు పాలు తో జీవనం సాగిస్తూ కుటుంబం పోసితున్నాముము అని ఇప్పుడు ఏమి చేసి కుటుంబ ఎలా పోసించాలో అని ఆయన లేబోది బో మన్నారు. మాకు న్యాయం చేయాలని ఆయన కుటంబ సభ్యులు అంటున్నారు. డాక్టర్ పక్క మండలం నుండి వచ్చి వైద్యం చేసి, మండలవైద్య అధికారులను విస్మరించి మా ఆవును కోల్పోయమని వారు అంటున్నారు.

## రేపు, ఎల్లుండి సంత వీధి సచివాలయంలో... సమగ్ర సర్వే స్పెషల్ క్యాంపు.

.... ఓటర్ల సవరణ పెండింగ్ ఉన్న ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

.... పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేసిన తాసిల్దార్ మధు నాయక్.



**గోరంట్ల జులై 10 సీమ వార్త సాయంత్రం.** స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (సర్ ) కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 న శనివారం మరియు 12 న ఆదివారం రెండు రోజుల పాటు సచివాలయం--04 సంత లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ మధు నాయక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గోరంట్ల పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధార్ కార్డు, ఫోటో, మరియు అవసరమైన సంబంధిత పత్రాలతో హాజరై తమ ఓటరు వివరాలను నమోదు, సవరణ, మార్పులు లేదా ఇతర అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసుకోవలసిందిగా విజ్ఞప్తి చేయడమైనది. అదేవిధంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఓటరు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా సహకరించవలసిందిగా కోరడమైనది.నిర్దేశించిన గడువులోపు అవసరమైన వివరాలు సమర్పించని పక్షంలో, నిబంధనల ప్రకారం మీ పేరు ఓటరు జాబితా నుండి తొలగించబడే అవకాశం ఉన్నందున, ప్రతి అర్హత గల ఓటరు తప్పనిసరిగా ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో పాల్గొని తమ వివరాలను ధృవీకరించు కోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881